- ఎమ్మెల్యే స్వగ్రామంలో వరుస అరెస్టుల కలకలం
- వైసీపీ నాయకుడు ఇంటూరి హరిబాబు అదుపులోకి తీసుకున్న గుడ్లూరు పోలీసులు
- అక్కడ నుండి ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించిన వైనం
- ఎలాంటి ఫిర్యాదులు లేకుండా అదుపులో తీసుకోవడం ఏమిటని వైసీపీ నేతల ఆగ్రహం..
- డీఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన
- వైసీపీ అభ్యర్థులను బెదిరిస్తున్నారంటూ బుర్రా ధ్వజం
- ఓటు హక్కుకు సంకెళ్లు.. ప్రజాస్వామ్యానికి తూట్లు!
- కందుకూరులో అరాచక పాలన..అంటూ ధ్వజం
- ఎస్పీని కలిసిన ఇంటూరి భారతి....
- రాత్రి 10 గంటల తరువాత షరతులతో హరిబాబును విడిచిపెట్టిన పోలీసులు

సుధాకార్ రావును అప్పగిస్తేనే హరిబాబును వదిలేస్తాం

కందుకూరు శిఖర జనసాక్షి: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణం. తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకునే స్వేచ్ఛ ప్రతి పౌరు

డికి రాజ్యాంగం కల్పించిన హక్కు. కానీ కందుకూరు నియోజకవర్గంలో ఎన్నికల వేళ ఆ స్వేచ్ఛకు సంకెళ్లు పడుతున్నాయి...నామినేషన్ వేస్తుంటే అడ్డుకోవడం. ఉపసంహరించుకోపోతే వత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడుతున్నారు.అధికారపార్టీ అడ్డదండలతో పోలీసు యంత్రాంగాన్ని అధికార యంత్రాగన్ని పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకోవడాన్ని ప్రతిక్షాల పార్టీల నాయకులు తప్పుపడుతున్నారు.ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థే ప్రజల పట్ల భయాందోళనలకు కారణమవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యంలో పోటీ చేసే హక్కుకు భరోసా,ఓటు వేసే స్వేచ్ఛకు రక్షణ లేకుండా పోతుందని, ప్రజాతీర్పును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ప్రజల్లో భయాందోళన కలిగిస్తున్నాయి.ఎన్నికల నిబంధనలు తూచా తప్పకుండా పాటించాల్సిన అధికార యంత్రాంగం కాగితాలకే పరిమితమైతే ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. ఓటరు నిర్భయంగా ఓటేసే పరిస్థితి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ వారే నిలవరించే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసం.ప్రజాస్వామ్య పరిరక్షణలో రాజీకి తావుండకూడదు మేధావులు అభిప్రాయం, అయితే వాటన్నింటిని కాలరాస్తూ ఓటు హక్కు స్వచ్ఛకు భంగం కలిగించేలా కొందరు ఎన్నికల అధికారులు,భంగం కలిగిస్తుంటే ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.ఇలాంటి సంఘటనలు రాజీకీయ మేధావులు ఘండిస్తున్న అధికార పార్టీల నాయకుల్లో మార్పు రాకపోవడం చోచనీయం,ఈ దారుణం ఇలాగే కొనసాగితే భవిష్యత్తరాలకు ముప్పుపొంచి ఉన్నట్లే. అందుకు ఉదాహరణే ఈ సంఘటన....స్థానిక సంస్థల ఎన్నికల వేళ వలేటివారిపాలెం మండలంలో పోలీసుల వ్యవహారశైలి రాజకీయ వివాదానికి కేంద్రబిందు వైంది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వగ్రామమైన బడేవారిపాలెంలో వైసీపీ నాయకుల వరుస అరెస్టులు కలకలం రేపుతున్నాయి.ఆదివారం నలమోతు చంద్రమౌళిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, సోమవారం తెల్లవారు జామున మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఇంటూరిభారతి భర్త,వైసీపీ నాయకుడు ఇంటూరి హరిబాబును కూడా తీసుకెళ్లడం తీవ్ర విమర్శలకు దారితీసింది.హరిబాబు ఇంటి వద్దకు చేరుకున్న పోలీసులు ఆయనను కారులో ఎక్కించుకుని ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఎందుకు తీసుకెళుతున్నారంటూ కుటుంబ సభ్యులు ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వలేదని వారు ఆరోపించారు.ఈ విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు గుడ్లూరు పోలీసు స్టేషన్‌కు చేరుకుని విడదల చేయాలని కోరుతున్న సమయంలోనే గుట్టు చప్పుడు కాకుండా హరిబాబు మరో ప్రాంతానికి తరలించారు.

సుధాకరరావును అప్పగిస్తేనే హరిబాబును వదిలేస్తాం.

దీంతో కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే,బుర్రా మధుసూన్ యాదవ్ హరిబాబు భార్యభారతి,సుధాకర్‌రావు కుమారుడుతో పాటు మరి కొందరు నాయకులతో కలిసి డీఎస్పీ బాలసుబ్రమణ్యం కలవగా, భారతి తమ భర్తను బలవంతంగా తీసుకెళ్లారంటూ డీఎస్పీకి భారతి ఫిర్యాదు చేసింది.తన భర్త ఇంటూరి హరిబాబును గుడ్లూరు సీఐ మరికొందరితో కలిసి ప్రైవేటు వాహనంలో వచ్చి, తన భర్తను బలవంతంగా తీసుకెళ్లారని భారతి ఫిర్యాదులో పేర్కొన్నారు.పోలీస్ స్టేషన్‌లో విచారించగా తన భర్త అక్కడ లేరని చెప్పారని, ఆయన ఆచూకీ తెలియక ఆందోళన చెందుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తకు రక్షణ కల్పించి, ఆయన ఎక్కడ ఉన్నారో తెలియజేసి ఇంటికి పంపించాలని,సంబంధిత సీఐపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ నేపథ్యంలో డీఎస్పీ మాట్లాడుతూ వలేటివారిపాలెంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఉన్నం సుధాకర్‌రావు తమకు అప్పగిస్తేనే హరిబాబును తీసుకెళ్లవచ్చన్న రీతిలో షరతు విధించడంపై వైసీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేస్తున్న అభ్యర్థిని తాము పోలీసులకు అప్పగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.

ఎస్పీని కలిసిన ఇంటూరి భారతి.... డీఎస్పీ నుంచి తమ విజ్ఞప్తికి స్పందన లేదని ఆరోపిస్తూ జిల్లా ఎస్పీని ఇంటురి భారతి కలిశారు.తమ సమస్యను ఎస్పీకి వివరించారు.స్పందించిన ఎస్పీ న్యాయం చేస్తామని హామి ఇచ్చారు.ఈ క్రమంలో హరిబాబును ఉలవపాడు పోలీస్‌స్టేషన్ నుంచి కందుకూరు డీఎస్పీ కార్యాలయానికి తరలించారు.విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు అక్కడికి చేరుకుని హరిబాబును విడుదల చేయాలని ఆందోళన చేపట్టారు. ఈ పరిణామాల మధ్య రాత్రి పది గంటల అనంతరం హరిబాబును పోలీసులు విడుదల చేశారు.అయితే, స్వతంత్ర అభ్యర్థి సుధాకర్‌రావు మంగళవారం ఉదయం అప్పగించాలని పోలీసులు షరతు పెట్టినట్లు వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

కందుకూరులో అరాచక పాలన.. డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యంను కలిసిన అనంతరం వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు.కందుకూరు నియోజకవర్గంలో అరాచక పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నునామినేషన్లు ఉపసంహరించుకోవాలని టీడీపీ నాయకులచేత బెదిరించడమే అందుకు నిదర్శనమని అన్నారు.ఎన్నికలు స్వేచ్ఛగా,ప్రశాంతంగా జరగాల్సి ఉండగా,అభ్యర్థులపై ఒత్తిళ్లు తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు.నియోజకవర్గంలోని 5 మండలాల్లో తమ పార్టీ తరపున పోటీచేస్తున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులనులక్ష్యంగా చేసుకుని అధికార పార్టీ నాయకులు, పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. నామినేషన్లు ఉపసంహరించుకుంటే డబ్బులు ఇస్తామని ఆశ చూపుతున్నారని, అంగీకరించకపోతే కేసులు పెడతామని, కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు.

పోలీసులే ఫోన్లు చేసి బెదిరిస్తున్నారంటూ ఆరోపణ.. ప్రజలకు రక్షణ కల్పించాలన పోలీసులు వైసీపీ తరపున ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు పోలీసులే ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడటం దారుణంగా ఉందన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఎన్నికల్లో పోటీ చేసే హక్కుఉందని, ఆ హక్కును అడ్డుకునేలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, బెదిరింపులకు తావులేకుండా అధికారులు చర్యలు తీసు కోవాలని కోరారు.తాను కందుకూరులో రౌడీయిజం చేస్తున్నానని ఎమ్మెల్యే ఆరోపిస్తున్నారని,తనపై విమర్శలు చేయడం కంటే ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించడంపై దృష్టి పెట్టాలని బుర్రా హితవు పలికారు. నిజంగానే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని భావిస్తే ఆ పనులను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని సూచించారు.అభివృద్ధి పేరుతో ప్రజల మద్దతు కోరాల్సింది పోయి,అభ్యర్థులను భయపెట్టే పరిస్థితులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు.

అభ్యర్థి కుటుంబానికి వేధింపులంటూ ఆవేదన... బడేవారిపాలెం ఎంపీటీసీ స్థానానికి తరఫున నామినేషన్ వేసిన ఉన్నం సుధాకర్‌రావును నామినేషన్ ఉపసంహరించు కోవాలని ఒత్తిడి చేస్తున్నారని ఆయన కుమారుడు వెంకట్రావు ఆరోపించారు. భయాందోళనల నేపథ్యంలో తన తండ్రిని రహస్యంగా ఉంచాల్సి వచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు వివరించి,వీడియో కాల్ ద్వారా తండ్రితో మాట్లాడిస్తామని చెప్పినా అంగీకరించలేదని పేర్కొన్నారు. తన తండ్రిని తీసుకురావాలని గ్రామస్థులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు.ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్‌కు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

పోలీసుల తీరుపై ఇంటూరి భారతి తీవ్ర నిరసన.. ఎంపీటీసీ అభ్యర్థి సుధాకర్‌రావు ఆచూకీ చెప్పాలంటూ బెదిరించి తన భర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఇంటూరి భారతి ఆరోపించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామా, లేక భయపెట్టే పాలనలో ఉన్నామా అన్న సందేహం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై డీఎస్పీని కలిసినా తగిన స్పందన లభించలేదని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని,ఓటు ద్వారా సమాధానం చెబుతారని హెచ్చరించారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో సాగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు, కందుకూరు మండల వైసీపీ ఇన్‌చార్జులు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జలదంకిలో జోరుగా వైసీపీ ఎన్నికల ప్రచారం

జలదంకిలో శిఖర జనసాక్షి: ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి, యువ నాయకులు మేకపాటి అభినవ్‌రెడ్డి ఆశీస్సులతో జలదంకి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బలపరిచిన బిట్-2ఎంపీటీసీ అభ్యర్థి సూరే వెంకట పద్మావతి,బిట్-1ఎంపీటీసీ అభ్యర్థి తిప్పారెడ్డి ఇందిరమ్మలకు మద్దతుగా జలదంకిలోఎన్నికల ప్రచారం సోమవారం జోరుగా సాగింది.వైసీపీ మండల కన్వీనర్ ఇస్కు మదన్ మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా అభ్యర్థులు, పార్టీనాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బిట్-2ఎంపీటీసీ అభ్యర్థి సూరే వెంకట పద్మావతి, బిట్-1ఎంపీటీసీ అభ్యర్థి తిప్పారెడ్డి ఇందిరమ్మలకు కేటాయించిన ఫ్యాన్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులుకార్యకర్తలు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం-జిల్లా కలెక్టర్ విజయ సునీత

మార్కాపురం శిఖర జనసాక్షి: దేశ రక్షణ,సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ఎం విజ యసునీత పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం మార్కాపురం నగరంలో నిర్వహించిన భారీ క్యాండిల్ ర్యాలీకి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నగరంలోని ఎస్పీ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, ఎస్పీ పంకజ్ కుమార్ మీనా జెండా ఊపి క్యాండిల్ ర్యాలీని ప్రారంభించారు.అక్కడి నుండి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ ముందు ఉన్న ప్రధాన కూడలి వరకు సాగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతిలో వెలుగుతున్న కొవ్వొత్తిని పట్టుకుని నడుస్తూ, అమరులైన పోలీసులకు ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించడానికి, ప్రజలప్రాణ,ఆస్తుల రక్షణ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తూ, ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని పోలీస్ అమరవీరుల సేవలు అత్యున్నతమైనవని కొనియాడారు.విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అమరుల త్యాగనిరతిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ దేశసేవలో, సమాజ పురోగతిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎస్పీ పంకజ్ కుమార్ మీనా మాట్లాడుతూ అమరవీరుల అత్యున్నత త్యాగాలను స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం ఈ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలియజేశారు.పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.